క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

తాళ్లూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ దారా హనుమంతురావు తెలిపారు. ఎంపీపీ టి.శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి జెడ్పీటీసీ, మండలం పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

క్షయ నివారణలో రాజుకు ప్రశంస



ప్రశంస పత్రం అందుకుంటున్న రాజు

ముండ్లమూరు (దర్శి): ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మారెళ్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కేపీ రాజుకు క్షయ నివారణ సేవలు అందించినందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రిమ్స్ ఛాతి విభాగాధిపతులు బెస్ట్ సర్వీస్ సర్టిఫికెట్ అందజేశారు. శాలువా, పూలమాలలతో ఘనంగా ఆయన్ను సత్కరించారు. మారెళ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, వైద్యాధికారులు సీహెచ్ ప్రవీణ్‌కుమార్, బి.మధుశంకర్ తదితరులు రాజును అభినందించారు.

బాలల భద్రత అందరి బాధ్యత



హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లికార్జునరావు

తాళ్లూరు: పాఠశాలల్లో చదువుకునే బాలబాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎస్.మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఫోక్సో చట్టం గురించి సోమవరం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యను అభ్యసించే బాలబాలికలకు రక్షణ కల్పించాలన్నారు. ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎంఈఓ-1 సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్‌లు మాట్లాడుతూ బాలబాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పులిపాడు శివారు పొలాల్లో పేకాడుతున్న ముగ్గురు జూదరులను ఎస్సై వై.నాగరాజు సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద రూ.31,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. తమ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలకు ఆత్మరక్షణ మెళకువలు అవసరం

మార్కాపురం టౌన్: మహిళలు ఆత్మరక్షణ మెళకువలు తెలుసుకోవాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు సూచించారు. సోమవారం డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు, శక్తి యాప్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. చదువుపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన నివాళి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పాదిలి ప్రసాద్ గుండెపోటుతో మరణించగా ఆయన చిత్రపటానికి సహచర ఉద్యోగులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రసాద్ ఇటీవల కొంత పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రసాద్ గుండెపోటుతో అర్ధంతరంగా మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

200 మంది పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

కంభం: రంజాన్ పండగను పురస్కరించుకుని సోమవారం స్థానిక చిన్న మసీదులో 200 మంది పేద ముస్లింలకు రూ.2.50 లక్షల విలువైన 19 రకాల నిత్యావసర సరుకుల కిట్‌ను పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా చిన్న మసీదు కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో కిట్లు పంపిణీ చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు డిష్ మున్నా తెలిపారు. కార్యక్రమంలో హాఫీజ్ హంజా, ఆదిల్, జబ్బార్, మహబూబ్ బేగ్, అత్తార్ షేక్ హుస్సేన్(దాదా), ఖాసింపీరా, సయ్యద్ ఖాన్, సమీర్, షాకీర్, రిహాన్, సాహిల్, షా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుల దిగాలు



పెద్దారవీడులో కందులు జల్లెడ పడుతున్న కూలీలు



కేంద్రానికి రైతు తెచ్చిన కందులు



కందుల బస్తా కాటా వేస్తున్న కూలీలు

- తగ్గిన దిగుబడి, గిట్టుబాటు లేని ధరలు
- రాని పెట్టుబడి ఖర్చులు
- రైతులకు దక్కని మద్దతు ధర

పెద్దారవీడు: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన కంది పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. శ్రమ, పెట్టుబడికి తగిన ఫలితం దక్కక పోతుండడంతో ఖరీఫ్‌లో కంది సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఏడాది దిగుబడులు కూడా ఆశాజనకంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 2666 ఎకరాలు కంది పంట సాగు చేశారు. గ్రామాల్లో కంది పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కందులు ఇళ్లకు చేరుతున్నాయి. గతేడాది కల్లాల్లోనే కందులు కొన్న వ్యాపారులు ఈ ఏడాది ముఖం చాటేస్తున్నారు. బయట మార్కెట్‌కు తీసుకెళ్తే చాలా తక్కువ రేటుకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. అక్కడికంటే పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఎక్కువగా ఉండటంతో రైతులు అటు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మార్క్ ఫెడ్‌కు కందులు ఎలా అమ్ముకోవాలనే దానిపై చాలా మంది రైతులు ఆరా తీస్తున్నారు. పంట చేతికొచ్చే సమయానికి రేటు లేకుండా పోవడంతో రైతులు డీలా పడుతున్నారు. ఎకరాకు దాదాపు రూ.30 వేలు పెట్టుబడి అవుతుందని, ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. గతేడాది కందులు క్వింటా బహిరంగ మార్కెట్లో ధర రూ.11 వేలు వరకు పలికింది. గతేడాది ప్రభుత్వం రూ.9650 వరకు మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం బయట మార్కెట్లో క్వింటా ధర రూ.6,300 నుంచి రూ.6,500 వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఎకరాకు 6 క్వింటాళ్ల చొప్పున క్వింటా ధర రూ.7,550 ప్రకారం కొనుగోలు చేస్తుందని, రైతు ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందని అధికారులు తెలిపారు. రైతుకు ఎకరాకు రూ.10 వేలు కూడా మిగలని పరిస్థితులు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మద్దతు ధరకు అమ్మితేనే కొంత వరకు గిట్టుబాటు అవుతుందని, లేకుంటే బయట మార్కెట్లో రూ.6,500 మించడం లేదు. ప్రభుత్వం కొనుగోలు విషయంలో అధికారులు నిబంధనలు పాటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గింజల్లో పురుగుపట్టిన గింజలు, తేమ శాతం, కొన్ని నిబంధనలు పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కేంద్రానికి ఆటోలో తీసుకొచ్చిన కందులు సక్రమంగా లేవని తిరిగి తీసుకెళ్లండని రైతులకు అధికారులు చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో బయట మార్కెట్లో దళారులు ఎంతకు అడిగితే అంత రేటుకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. రైతుల శ్రమ పక్కన పెట్టితే దుక్కుల నుంచి విత్తనం నాటి పంట కోతకు వచ్చే వరకు అయ్యే సస్యరక్షణ ఖర్చులను లెక్కగడితే మిగిలేది ఏమీ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివాపురం, కొత్తూరు గ్రామాల రైతులు దాదాపు 20 క్వింటాళ్ల కందులు కేంద్రానికి తీసుకొస్తే అవి సక్రమంగా లేవని వెనక్కి పంపించారని వారు వాపోయారు. కంది పంటకు గిట్టుబాటు ధర కొంచం అటు ఇటుగా ఉన్నా దిగుబడులు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో కొంత మేర నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వర్షాభావ ప్రభావంతో సక్రమంగా పండని కంది పంటకు పెట్టిన పెట్టుబడి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని మద్దతు ధర కల్పించాలని, నిబంధనలు సడలించి ఎక్కువ శాతం కందులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇలా..నమోదు చేసుకోవాలి

మద్దతు ధరకు అమ్ముకునే రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వీఏఏలు సీఎం ఏపీపీ ద్వారా పేరు నమోదు చేసుకోవాలి. కంది పంట ఈ-క్రాప్ నమోదు చేసి ఉండాలి. కందుల శాంపిల్స్ తీసుకుని చూపించాలి. డీసీఎంఎస్ ప్రతినిధులు వచ్చి కందుల నాణ్యతను పరీక్షించి షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలి. 100 కిలోలు రూ.7,550 ధర ప్రభుత్వం నిర్ణయించింది. కొనుగోలు చేసిన వారం రోజుల్లోపు నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తారు.

రైతుల వద్దే నేరుగా కొనుగోళ్లు:



రైతుల నుంచి మాత్రమే మద్దతు ధరకు కందులు కొనుగోలు చేస్తాం. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తాం. కందులు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండాలి. 12 శాతం లోపు తేమ, కల్తీ గింజలు 3 శాతం, దెబ్బతిన్న గింజలు 3 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న రంగుమారిన, విరిగిన గింజలు 4 శాతం, పరిపక్వం లేని, ముడత గింజలు 3 శాతం, పురుగు పట్టిన గింజలు 4 శాతంలోపు ఉంటే వాటిని డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. మిషన్ ద్వారా కంది కోసిన తర్వాత పంటను బాగా ఆరబెట్టాలి. తగిన నాణ్యతాప్రమాణాలు వచ్చిన తర్వాత శాంపిల్స్ వీఏఏలకు అందిస్తే వారు మార్క్‌ఫెడ్ ప్రతినిధులను రప్పించి కొనుగోలు చేయిస్తారు.
– కె.బుజ్జిబాయి, ఏఓ, పెద్దారవీడు

కనీసం రూ.10 వేల మద్దతు ధర ప్రకటించాలి:



కంది పంట రెండు ఎకరాల్లో సాగు చేశా. వర్షాభావంతో ఈ ఏడాది దిగుబడి తగ్గింది. ఎరువులు, పురుగుమందులు, ఇతర పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ మాత్రం సరిపోదు. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి ఖర్చులను దృష్టిలో ఉంచుకుని క్వింటాకు కనీసం రూ.10 వేల మద్దతు ధర చెల్లించాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.
– మెన్నా వెంకటేశ్వరరెడ్డి, రైతు, గొబ్బూరు

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ



విద్యార్థులను తనిఖీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు



పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై శివ

ముండ్లమూరు (దర్శి): మండల కేంద్రం ముండ్లమూరులో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ వై.నాగరాజు సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులు పరిశీలించారు. లక్ష్మీనారాయణ, నాగరాజు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. విద్యార్థులకు తాగు నీటి సౌకర్యంతో పాటు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తం 472 మందికి 465 మంది పరీక్షలు రాయగా ఏడుగురు గైర్హాజరయ్యారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 212 మందికి 210 మంది విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలో 260 మంది విద్యార్థులకు 255 మంది పరీక్షలు రాశారన్నారు. కార్యక్రమంలో అధికారులు ఆదాం, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును ఎస్సై ఎం.శివ పరీక్షించారు. ఎవరూ పరీక్ష కేంద్రాల వద్ద గుమిగూడకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మూడు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు.

పెద్దారవీడు: మండలం పరిధిలోని నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాతంగా సోమవారం జరిగాయి. పెద్దారవీడు, దేవరాజుగట్టు, ఓబులక్కపల్లి, ఏనుగులదిన్నెపాడు కేంద్రాల్లో గణిత పరీక్షకు మొత్తం 590 మంది విద్యార్థులకు 585 మంది పరీక్షకు హాజరయ్యారు. దేవరాజుగట్టు, ఏనుగులదిన్నెపాడు, ఓబులక్కపల్లి కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, ఏనుగులదిన్నెపాడు కేంద్రాన్ని తహసీల్దార్ శైలేంద్రకుమార్, నాలుగు కేంద్రాలను ఎంఈఓ పి.శ్రీనివాసులు సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాళ్లూరు పరీక్ష కేంద్రాలపై నిఘా

తాళ్లూరు: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలపై జిల్లా విద్యాశాఖాధికారి, రాష్ట్ర పరీక్షల విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తం ఆరు పరీక్ష కేంద్రాల్లో మూడు పరీక్షలు ఆయా చీఫ్‌లు, డీవోల మెతక వైఖరి కారణంగా కొన్ని అక్రమాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. మెరిట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షలు ఇలా నిర్వహించడం ఏమిటని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇన్విజిలేటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు సమాచారం. విషయం కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి వెళ్లడంతో సోమవారం లెక్కల్ పరీక్ష ఎటువంటి అవకతవకలు జరగకుండా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. 144 సెక్షన్‌తో పాటు పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో ఉదయం పూట క్లాసులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, రాష్ట్ర పరీక్షల విభాగం ప్రత్యేక స్క్వాడ్ అధికారి సుబ్బారెడ్డి స్థానిక వీకే ఉన్నత పాఠశాల, సరస్వతి హైస్కూల్‌తో పాటు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. వాహనాలను దూరంగా నిలిపి సాధారణ వ్యక్తుల్లా ఆయా పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. తాళ్లూరు, తూర్పుగంగవరం పరీక్ష కేంద్రాల్లో జిల్లా విద్యాశాఖాధికారి రాకతో లెక్కల్ పరీక్ష చాలా పకడ్బందీగా జరిగిందని విద్యార్థులు, తల్లిదండ్రులు చెబుతున్నారు. తూర్పుగంగవరం జాహ్నవి పాఠశాలలో పరీక్షల చీఫ్‌ను, డీఓలను మార్చేశారు. చీఫ్‌గా వెంకటేశ్వర్లు, డీఓగా కృష్ణారెడ్డిలను నియమించారు. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 821 మందికి 809 మంది పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య తెలిపారు. జాహ్నవి పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. తాళ్లూరులో ఎంఈఓ-2 సుధాకర్ సందర్శించి పరీక్షల నిర్వాహణ తీరును గమనించారు. బొద్దికూరపాడు ఎ, బి కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ సమయంలో గోడల వద్ద అందిస్తున్న చిట్టీల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ పాఠశాలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచి మాస్ కాపీయింగ్‌ను అరికట్టాల్సి ఉంది.

ఈద్గాలో పారిశుధ్య పనులు



శుభ్రం చేస్తున్న కార్మికులు

పొదిలి: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక బుగ్గచలం ట్యాంకు వద్ద ఉన్న ఈద్గాను శుభ్రం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలుత మైదానంలో ఉన్న చెత్త, పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించే పనులను నగర పంచాయతీ కార్మికులు చేస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈద్గాను ముస్తాబు చేస్తామని మైనారిటీ సెల్ నాయకుడు రసూల్, మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలానీ తెలిపారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎం హెచ్‌ఓ పద్మావతి



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

మార్కాపురం: టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి అన్నారు. టీబీ డే సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో కలిసి టీబీ వ్యాధిపై ర్యాలీని సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం తగ్గకపోవడం, బరువు తగ్గిపోవడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీకి మంచి మందులు ఉన్నాయని, ఉచితంగా ప్రభుత్వ వైద్యశాలలో తీసుకోవచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రవణ్, శివారెడ్డి, ఎస్‌టీఎస్ గోవిందరాజులు, టీబీహెచ్‌వీ లక్ష్మీరెడ్డి, ఎన్ ఆవులయ్య, నాగేంద్రరెడ్డి, ప్రత్యూష, ఏఎన్‌ఎంలు, ఆశాలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆ పార్టీ కార్యకర్త ఎం.వెంకట రామయ్య మృతికి సోమవారం నివాళులర్పించారు. త్రిపురాంతకం మండలం మేడపి గ్రామానికి చెందిన వెంకటరామయ్య తన ద్విచక్ర వాహనంపై నీలంపాటి అమ్మవారి దర్శనం చేసుకొని తిరిగి వస్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయాలైన ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడపి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు.

క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



పెద్దదోర్నాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దదోర్నాల: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీబీ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి నటరాజ్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సంజీవ్ మాట్లాడుతూ రెండు వారాలకు మించిన దగ్గు, రెండు వారాలకు మించి జ్వరం, బరువు తగ్గటం, లేదా దగ్గినప్పుడు రక్తం పడుతుంటే క్షయ వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, లేదా తుమ్మినప్పుడు ఆ తుప్పర్ల ద్వారా సూక్ష్మక్రిములు ఇతరులకు వ్యాపించి వారిలో వ్యాధికి కారణమవుతుందని తెలిపారు. క్షయవ్యాధిని కళ్లె పరీక్ష ద్వారా గుర్తించి నిర్ధారించవచ్చని, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలలో వ్యాధికి సంబంధించిన మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ప్రజలందరూ క్షయ వ్యాధి విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ర్యాలీలో వైద్యాధికారులు మెర్సీ ప్రియాంక, కళా సంధ్య, మౌనిక, టీబీ యూనిట్ అధికారి వెంకటరమణ, ఎల్‌టీ చిరంజీవి, మంత్రునాయక్, వెంకటేశ్వరరెడ్డి, ఆరోగ్య మిత్రలు, చంద్రశేఖర్, మణికుమార్ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు చింతల, కొర్రపోలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై అవగాహన కల్పించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతపకుమార్

పుల్లలచెరువు: పాఠశాలల్లోని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎస్‌ఐ సంతపకుమార్ అన్నారు. సోమవారం పోలీసుస్టేషన్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ప్రైవేట్ ఉపాధ్యాయులతో ఎస్సై మాట్లాడారు. రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న విషయాలు, పలు అంశాలను మీరు గమనిస్తున్నారని, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కొరవడిందన్నారు. సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై, ఫోక్సో యాక్ట్‌ల గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థుల నడవడికను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని చెప్పారు. భావి తరాలకు ఆదర్శంగా ఉండాల్సిన విద్యార్థులు నేడు చెడు మార్గాలకు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు గమనిస్తూ వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా కృషి చేయాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

పెద్దారవీడు: ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులకు ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమని, పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడులు సాధించవచ్చన్నారు. వెలుగు సిబ్బంది సహకారంతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసికట్టుగా ప్రకృతి వ్యవసాయంపై మరింత విస్తృతంగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే ఏడాదిలో వార్షిక ప్రణాళిక తయారు చేసి ప్రతి గ్రామ సంఘం పరిధిలో స్వయం సహాయ సంఘాల ద్వారా ప్రతి రైతు సాగు చేయబోవు మొత్తం విస్తీర్ణం పంట పేరు నమోదు చేయాలన్నారు. పంట నమోదు చేస్తే ఒక నిర్దిష్టమైన ప్రణాళిక, లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలవుతుందని చెప్పారు. వెలుగు ఏపీఎం కృపమ్మ, ఏఈఓ సునీల్, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు లలితమ్మ, ఎల్‌ఐ రవీంద్రరెడ్డి, వీఓఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

చప్టా నిర్మించాలని మహిళల వినతి



సమస్యపై ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

బేస్తవారిపేట: స్థానిక నెహ్రూ వీధి చివరన చప్టా నిర్మాణం కోసం తీసిన గుంతలో వృద్ధులు, చిన్న పిల్లలు పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బేస్తవారిపేట పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న మహిళలు కార్యదర్శితోపాటు సర్పంచ్ తండ్రి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. 25 రోజుల క్రితం జేసీబీతో లోతైన గుంత తీసి వదిలేయడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారిందన్నారు. రెండు రోజుల్లో పనులు మొదలు పెట్టిస్తామని కార్యదర్శి హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

- సీఐ సుబ్బారావు

మార్కాపురం: గ్రామీణ ప్రజలు సైబర్ మోసాలు, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్, మేసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బారావు సూచించారు. పల్లె నిద్రలో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని వేములకోట గ్రామంలో రూరల్ ఎస్సై అంకమరావుతో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే వెబ్ లింకులను ఓపెన్ చేయవద్దని, అపరిచితులకు ఓటీపీ చెప్పవద్దని స్పష్టం చేశారు. బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. లోన్ యాప్స్, బెట్టింగ్ యాప్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.